
సాక్షి ఒడిశా
శనివారం । 16 । డిసెంబర్ । 2023





**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3.56.300లు. బంగారం 1గ్రాము 750 మిల్లీగ్రాములు, వెండి 5 గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



**రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి**

మల్కన్‌గిరి జిల్లాలోని కలిమెల సమితిలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు.

- 8లో



**సమాజానికి జవాబుదారీగా ఉండాలి**

- 8లో

పోలీసు అధికారులు సమాజానికి జవాబుదారీగా ఉండాలని బరంపురం ఎస్పీ సార్వక్ వివేక్ అన్నారు.

## న్యూస్‌రీల్

### మాజీ మంత్రి దామోదర్ రౌత్‌కు అనారోగ్యం



చికిత్స పొందుతున్న దామోదర్ రౌత్

భువనేశ్వర్: సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి దామోదర్ రౌత్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో స్థానిక ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దామోదర రౌత్ కుమారుడు ఎమ్మెల్యే సంబిత్ రౌత్ మాట్లాడుతూ.. తన తండ్రి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. కాలేయంలో ద్రవం పేరుకుపోవడంతో నిరంతర ఆరోగ్య పరిరక్షణ కోసం ఆస్పత్రిలో ఉన్నట్లు వివరించారు. మరో రెండు రోజుల్లో ఇంటికి తిరిగి వస్తారన్నారు. ఆయన శ్రేయోభిలాషులు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించడంతో పాటు ఆలయాల్లో సామూహిక దీపారాధన చేస్తున్నారు.


### ప్రారంభోత్సవానికి సన్నాహాలు

భువనేశ్వర్: శ్రీమందిరం ప్రాకార ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి చురుగ్గా సన్నాహాలు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది జనవరి 17వ తేదీన సుముహూర్తం. శాస్త్రీయ రీతిలో ఈ ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించాలని యోచిస్తున్నారు. ఈ వేడుకకు ప్రముఖులను అతిథులుగా ఆహ్వానించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు జాబితా సిద్ధం చేసినట్లు శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి (సీఏఓ) రంజన్ కుమార్ దాస్ తెలిపారు. ఆయన అధ్యక్షతన శుక్రవారం జరిగిన సాంస్కృతిక కమిటీ సమావేశంలో అతిథుల జాబితాను ఖరారు చేశారు. భారతదేశంలో ప్రసిద్ధ జగన్నాథ దేవాలయాలు, జ్యోతిర్లింగ క్షేత్రాలు, సాధుసంతులు, ఇతర మతపరమైన ప్రదేశాల నుంచి ప్రముఖులను ఈ ప్రారంభ వేడుకకు అతిథులుగా ఆహ్వానిస్తారు. దీనికోసం వివిధ నియోగి శాఖల సభ్యులు జాబితాను సిద్ధం చేసి శ్రీమందిరం పాలక మండలికి అందజేశారు. త్వరలో ఆహ్వాన పత్రిక సిద్ధం చేసి, అతిథులందరినీ ఆహ్వానించేందుకు సేవాయత్ ప్రతినిధులు ప్రత్యక్షంగా వెళ్లనున్నట్లు సమాచారం. ఆహ్వానితులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

### నిందితుడు అరెస్టు


జయపురం: కొంతమంది దుండగులు ఫోన్ ద్వారా బీహార్‌కు చెందిన ఒక యువకుడిని జయపురం పిలిచి అతడిని బంధించి, డబ్బులు డిమాండ్ చేసిన కేసులో ఒక దుండగుడిని జయపురం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఒక తెలియని వ్యక్తి సెప్టెంబర్ నెలలో బీహార్ రాష్ట్రానికి చెందిన అలోక్ కుమార్ పాశ్వాన్‌కు ఫోన్‌చేసి స్నేహం కుదుర్చుకున్నాడు. అనంతరం అతడిని జయపురం రమ్మని పిలిచాడు. దీనిలో భాగంగా సెప్టెంబర్ 17వ తేదీన వచ్చిన ఆయనను పలువురు వ్యక్తులతో కలిసి ఫోన్‌చేసిన వ్యక్తి కిడ్నాప్ చేశాడు. పాశ్వాన్ నుంచి కొంత డబ్బులు దోచుకున్నారు. అనంతరం వారి నుంచి పాశ్వాన్ తప్పించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిలో భాగంగా దర్యాప్తు చేసిన పోలీసులు ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం నిందితుల్లో ఒకడైన కుంతరకాల్ గ్రామానికి చెందిన మాధవ హరిజన్ కుమారుడు కృష్ణ హరిజన్ అలియాస్ కుష్టో(21)ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో మరో ముగ్గురు పరారీలో ఉన్నారని, కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

### బీఎస్ఎఫ్ జవాన్ల ఉచిత వైద్య శిబిరం



వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా రల్లెగెడ పంచాయతీ డాబాల్‌పహడ్‌లో 88 బెటాలియన్ బీఎస్ఎఫ్ జవాన్లు ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. అనంతరం గ్రామంలోని యువకులకు క్రికెట్, వాలీబాల్ కిట్లు అందజేశారు. అలాగే చిన్నారులకు స్కూల్ బ్యాగ్‌లు అందించారు. కార్యక్రమంలో బెటాలియన్ కామాండర్ వినోద్ సారిన్ తదితరులు పాల్గొన్నారు.



స్కూల్ బ్యాగులతో చిన్నారులు

# నేటి నుంచి పాహిలి భోగో సేవ



- నెల రోజుల పాటు జరగనున్న సేవలు
- నిత్యం జగన్నాథుడికి ప్రత్యేక నైవేద్యం

భువనేశ్వర్: శ్రీమందిరంలో పాహిలి భోగొ సేవ శనివారం నుంచి ఆరంభమవుతుంది. నెల రోజుల పాటు నిరవధికంగా ఈ సేవ కొనసాగుతుంది. ఏటా పవిత్ర ధనువు సంక్రాంతి పురస్కరించుకుని పాహిలి భోగో సేవ ప్రారంభించి మకర సంక్రాంతి వరకు నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక సేవాదుల కార్యక్రమం ఖరారైంది.

**పురాణ గాథ**

ధనువు సంక్రాంతి పురస్కరించుకుని శ్రీ మహాలక్ష్మి తన పుట్టింటికి వెళ్తుందని పురాణాలు తెలుపుతున్నాయి. ఆలయంలో మహాలక్ష్మి లేకపోవడంతో యశోద మాత జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర కోసం వ్యంజనాలు సిద్ధం చేస్తుంది. ధనువు సంక్రాంతి నుంచి మకర సంక్రాంతి ముందు రోజు వరకు స్వామికి పాహిలి భోగో నివేదిస్తారు. ఇది స్వామివారికి ఆద్య భోగం. పక్షులు కూయకముందే వేకువజామున శ్రీజగన్నాథునికి పాహిలి భోగో నివేదిస్తారు. మినప, గోధుమలతో చేసిన 32 రకాల వంటకాలు స్వామి పాహిలి భోగోగా సమర్పిస్తారు.

**సేవల షెడ్యూల్**

నెల రోజులపాటు సుదీర్ఘంగా సాగే పాహిలీ భోగొ సేవల కార్యక్రమం ఖరారు చేశారు. నిత్యం వేకువజాము 2 గంటలకు శ్రీమందిరం తలుపులు తెరుస్తారు. 2.30 గంటలకు అంతరాలయం శుద్ధి, 2.45 గంటలకు రోష హోమం, 3.15 గంటలకు మైలం, దంత మంజనం, దయం 4 ఒబొకాసా, 4.45 గంటలకు సూర్యపూజ, 5 గంటలకు ద్వారపాలకుల పూజతో అలంకరణ పూర్తి చేస్తారు. ఉదయం 5.20 నుంచి 6 గంటల మధ్య ప్రత్యేక రీతులతో భోగో నివేదన చేస్తారు. అనంతరం దైనందిన సేవాదులతో మధ్యాహ్నం 2.30 గంటలకు విరామానికి ఏర్పాట్లు చేస్తారు. ఈ కార్యక్రమాలను సకాలంలో నిర్వహించేందుకు సేవాయత్ వర్గం సహకరించాలని ఆలయ పాలక మండలి అభ్యర్థించింది.

**మధ్యాహ్న విరామం వెసులుబాటు**

ధనువు సంక్రాంతి నుంచి మకర సంక్రాంతి వరకు సాధారణంగా భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ రద్దీ నేపథ్యంలో నిత్యం నిర్వహించే పగటి పూట విరామం కార్యక్రమంలో తాత్కాలిక వెసులుబాటు కల్పించినట్లు శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి(సీఏఓ) రంజన్ కుమార్ దాస్ తెలిపారు.

వీటితో పెద్ద ఝిల్లి, తోడు ప్రధానంగా అరిస, కకరా, ఉండ్రాళ్లు వంటి తీపి పదార్థాలు నైవేద్యం నివేదిస్తారు.

# పరిశ్రమలను స్వాగతించాలి

- ఎస్పీ వివేకానంద శర్మ



విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు



లాలా కమలాపత్ సింఘానియా విగ్రహానికి నివాళులు



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

రాయగడ: దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే కొత్త పరిశ్రమలు ఏర్పాటవ్వాలని, అందుకు అందరూ స్వాగతించాలని ఎస్పీ వివేకానంద శర్మ అన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని జేకే పేపర్ మిల్‌లో పేపర్ మిల్ వ్యవస్థాపకుడు లాలా కమలాపత్ సింఘానియా 139వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమలతోనే ప్రగతి సాధ్యమవుతుందన్నారు. జిల్లాలో జేకే పేపర్ మిల్ ప్రజల ఆశాదీపంగా మారిందని కొనియాడారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించిందని వివరించారు. ఈ ప్రాంతం పారిశ్రామిక కేంద్రంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. జిల్లాలో ఉత్కళ అలూమిన, ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రో ఎల్లాయిస్ వంటి బృహత్తర పరిశ్రమలు ఉండడంతో దాని అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు దోహదపడుతున్నాయని వెల్లడించారు.

**జిల్లాకు ప్రత్యేక గుర్తింపు**

పేపర్ మిల్ వలన రాయగడ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు లభించిందని ఎస్పీ శర్మ అన్నారు. నేడు విదేశాల్లో సైతం వినియోగదారుల ఆదరణ పొందిందని పేర్కొన్నారు. అనంతరం పేపర్ మిల్ ఎగ్జిక్యూటీవ్ ఉపాధ్యక్షుడు వినయ్ దివేది మిల్ వార్షిక నివేదికను వివరించారు. జేకే వంటి పరిశ్రమలు దేశ ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో జేకే అనుబంధ సంస్థలు 53 ఉన్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా జేకే పరిశ్రమల్లో సుమారు 49 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. తదుపరి మిల్‌లో 40 ఏళ్లుగా సేవలందించిన ఇద్దరికి, 25 ఏళ్లు సేవలందించిన మరో నలుగురికి వెండి, బంగారు పతకాలతో సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి.

# వైభవం.. చౌయితి సంబరం



చౌయితి ఉత్సవాల్లో పాల్గొన్న అతిథులు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు



స్టాల్స్ ప్రారంభిస్తున్న ముదులి, మాఝిలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అనసూయా మాఝి

సదరు సమితి దంగలొడి పంచాయతీలోని పెనికొన ఆశ్రమ పాఠశాలలో చౌయితి సంబరాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 11 సమితుల్లో ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా పెనికొనలో జరిగిన ఉత్సవాలకు రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి ముఖ్య అతిథిగా, గౌరవ అతిథులుగా స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ అనసూయా మాఝి, అమో ఒడిశా నవీన్ ఒడిశా కో–ఆర్డినేటర్ పట్నాన గౌరి శంకర్ రావు, సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, సమితి వైస్ చైర్మన్ హరప్రసాద్ హెప్రుకు, బీడీవో అమూల్య కుమార్ సాహు, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ భాస్కర రైతా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదివాసీల భాష, సంస్కృతి, కళలను పరిరక్షించేందుకు ప్రతీ ఏడాది ఉత్సవాలకు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 26 నుంచి జిల్లా కేంద్రమైన రాయగడలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరగనున్న జిల్లాస్థాయి ఉత్సవాలకు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు.

- రాయగడ



కలశాలతో నదీ జలాలు తీసుకొస్తున్న దృశ్యం



స్టాల్స్ ప్రదర్శన

# యువకుడి దారుణ హత్య





సంఘటన స్థలం వద్దే కుప్పకూలిన ప్రమోద్



ప్రమోద్ కొలక (ఫైల్)

- చెల్లిని ప్రేమించడంతో హత్య చేసిన అన్న
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- మూడు గంటల్లోనే కేసు ఛేదించిన పోలీసులు

రాయగడ: చెల్లిని ప్రేమించిన వ్యక్తిని అన్న దారుణంగా హత్య చేసిన ఘటన స్థానిక గౌతంనగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. మృతి చెందిన వ్యక్తి సదరు సమితి పరిధిలోని ఖిలిమిసిగుడ గ్రామానికి చెందిన ప్రమోద్ కొలక (19)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రమోద్ కొలక జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు గంగాధర పువ్వలకు స్వయానా మేనల్లుడు. రాయగడలోని ఒక అద్దె ఇంట్లో ఉంటూ స్థానిక కళాశాలలో ప్లస్ త్రీ ఫైనల్ ఇయర్ చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో చెక్కాగుడలో నివసిస్తున్న అతని మామయ్య గంగాధర ఇంటికి వెళ్లి, తన మేనకోడలిని స్కూల్ నుంచి తీసుకొచ్చేందుకు స్కూటీపై శుక్రవారం వెళ్లాడు. ఆ సమయంలో కాపుకాసిన ఇద్దరు వ్యక్తులు ప్రమోద్‌ను ఆపి ఒకేసారి కత్తితో దాడి చేశారు. మూడుచోట్ల కత్తి గాయాలకు గురైన ప్రమోద్ అక్కడికక్కడే అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్పీ వివేకానంద శర్మ, ఎస్డీపీవో రస్మీరంజన్ సేనాపతి, ఐఐసీ కమలకాంత్ కుహరో సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.




విలేకరులతో మాట్లాడుతున్న గంగాధర్ పువ్వల

**ప్రేమ వ్యవహారమే కారణం**

యువకుడి హత్యకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖిలిమిసిగుడ గ్రామానికి చెందిన దీపక్ హిమిరిక (24), ఆర్య కొండగిరి (26)లు పోలీసులు అరెస్టు చేసినవారిలో ఉన్నారు. దీనికి సంబంధించి ఎస్పీ వివేకానంద శర్మ మాట్లాడుతూ.. ప్రేమ వ్యవహారమే హత్యకు కారణమని తెలియజేశారు. ప్రమోద్ కొలక ఖిలిమిసిగుడ గ్రామానికి చెందిన ఒక యువతితో ప్రేమలో పడ్డాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న యువతి అన్నయ్య దీపక్ హిమిరిక ప్రమోద్‌ను పలుమార్లు హెచ్చరించాడు. అయితే అందుకు ప్రమోద్ ససేమిరా వ్యతిరేకించడంతో దీపక్ తన స్నేహితుడు ఆర్య కొండగిరి సాయంతో ఈ హత్యకు పాల్పడినట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. హత్య జరిగిన మూడు గంటల్లోనే నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక వ్యూ పాయింట్ సమీపంలో వారిని పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

# పరిహారం చెల్లింపు సులభతరం



- ప్రత్యేక వెబ్‌సైట్ తీసుకొచ్చిన ప్రభుత్వం
- అన్ని శాఖలతో అనుసంధానం

భువనేశ్వర్: రాష్ట్రంలో ఏనుగుల దాడుల వలన అనేక మంది నిత్యం ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలా అకాల మరణానికి గురైన వారి కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ పరిహారం చెల్లింపు సులభతరం చేసేందుకు ప్రత్యేక వెబ్‌సైట్ ప్రవేశపెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని అటవీ శాఖలతో ఈ సైట్‌ను అనుసంధానం చేశారు. శాఖలవారీగా పరిహారం మంజూరు కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. బాధిత వర్గాల వివరాలు ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన వెంటనే పరిహారం మంజూరు ప్రక్రియ చేపడతారని పీసీసీఎఫ్ దేవిదత్త బిస్వాల్ తెలిపారు.

**పరిహారం పెంపుదల**

ఏనుగుల దాడిలో మృతి చెందినవారికి పరిహారాన్ని రూ.6 లక్షలకు పెంచారు. అలాగే ఏనుగుల బీభత్సంతో పంటనష్టం జరిగితే ఎకరాకు రూ.20 వేలు, ఆవులు, ఎద్దులు ఇతరేతర పశువుల మరణానికి సైతం పరిహారం పెంచడం జరిగిందని దేవిదత్త బిస్వాల్ వెల్లడించారు. వన్యప్రాణులపై ప్రజల దూకుడు నియంత్రణ లక్ష్యంతో పరిహారం పెంచినట్లు పేర్కొన్నారు. ఏనుగులు–మానవ ఘర్షణల్లో ఏటా సుమారు 60 మంది చనిపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల్ని చైతన్య పరచాల్సి ఉందన్నారు. ఏనుగుల సంచార ప్రాంతాలకు వెళ్లకపోతే దాదాపు 50 శాతం దాడులు తగ్గిపోతాయని పేర్కొన్నారు. ఈ విషయంపై అజాగ్రత్తలతో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఏనుగుల పాఠశాల**

రాష్ట్రంలో త్వరలో ఏనుగుల పాఠశాల ప్రారంభించనున్నట్లు పీసీసీఎఫ్ దేవిదత్త బిస్వాల్ తెలిపారు. ఈ మేరకు వివిధ రాష్ట్రాలతో చర్చలు జరుపుతున్నామన్నారు. కుమ్కి ఏనుగుల వంటి ట్రెండ్ ఏనుగులు వాటి మావటిల అదుపులో ఉంటాయి. ట్రెండ్ ఏనుగులు మచ్చిక స్వభావంతో దురుసు లక్షణాల గల అటవీ ఏనుగును మచ్చిక చేసుకుంటాయని పేర్కొన్నారు. అభయారణ్యంలో ఈ వర్గం ఏనుగులను వాడుకోవచ్చు. రాష్ట్రంలో కొన్ని ట్రెండ్ ఏనుగులు అందుబాటులో ఉన్నాయి. బయటి నుంచి ఎక్కువ వస్తే మన ఏనుగులు మరింత ట్రెండీగా ఉంటాయి. వీటి కోసం పొరుగు రాష్ట్రాలతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. ట్రెండ్ ఏనుగులతో పాఠశాల నిర్వహిస్తారు. దీని కోసం చందక, షిమిలిపాల్, సతొకొషియా అభయారణ్యాల్లో ట్రెండ్ ఏనుగులను కలిగి ఉన్నారు. అలాగే కర్ణాటక, అసోంలతో చర్చలు జరుగుతున్నాయి.

## క్లుప్తంగా

### జాతీయ స్థాయిలో రాణించాలి



యోగా క్రీడాకారులను అభినందిస్తున్న క్యాంపస్ డైరెక్టర్ ధనబాలాజీ, అధికారులు

**ఎచ్చెర్ల క్యాంపస్:** క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకు రావాలని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ట్రిపుల్ ఐటీ ఎస్ఎం పురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ కోరారు. ట్రిపుల్ ఐటీ ఇంజినీరింగ్ రెండో ఏడాది విద్యార్థిని వై.నళిని జాతీయ యోగా పోటీలకు ఎంపికైంది. ఈ నెల 8, 9 తేదీల్లో గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఐదుగురు విద్యార్థులు పాల్గొనగా, నళిని మెరుగైన ప్రదర్శనతో జాతీయ స్థాయికి ఎంపికైంది. జాతీయ స్థాయిలోనూ విజేతగా నిలవాలని డైరెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, యోగా విభాగాధిపతి డాక్టర్ ఈశ్వరరావు, యోగా అధ్యాపకులు అర్చన, ధనుంజయరావు పాల్గొన్నారు.

### ట్రాక్టర్ దగ్ధం



మంటల్లో దగ్ధమవుతున్న ట్రాక్టర్

**మందస:** మండలంలోని ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ దగ్ధమైంది. ఒడిశాలోని కొంతాసాయి గ్రామానికి చెందిన సురోజో అనే వ్యక్తి మందస మండలంలోని కుడుమాసాయి సమీపంలో ట్రాక్టర్, యంత్రంతో కళ్లంలో వరి నూర్పు చేయిస్తున్నాడు. ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ నుంచి నిప్పులు రాగా, గడ్డి ఉండడంతో క్షణాల్లోనే మంటలు వ్యాపించాయి. రైతులు ధాన్యాన్ని, వరికుప్పలను వేరు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వరినూర్పు యంత్రానికి పాక్షికంగా నష్టం వాటిల్లగా, ట్రాక్టర్ మాత్రం మంటల్లో కాలిపోయింది. స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని, సహాయ చర్యలు చేపట్టారు.

### మద్యం దుకాణం సేల్స్‌మెన్‌ల అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో విజిలెన్సు సీఐ కుమార్, ఎస్ఐ శ్రీరామమూర్తి తదితరులు

**కోటబొమ్మాళి:** కోటబొమ్మాళి మెయిన్ రోడ్డులోని 1991 నంబర్ మద్యం షాపులో పని చేస్తున్న ముగ్గురు సేల్స్‌మెన్లు ఎర్ర అటకేశ్వరరావు, జమ్మ బాలరాజు, మెండ పెంటయ్యలను శుక్రవారం అరెస్టు చేసి కోటబొమ్మాళి కోర్టులో హాజరుపరిచామని ఎస్ఈబీ ఎస్ఐ బి.అప్పారావు తెలిపారు. కోర్టు ఈ నెల 29 వరకు రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం విజిలెన్సు సీఐ కేవైఎస్ బీఆర్ కుమార్, ఎస్ఐ బి.శ్రీరామమూర్తి, స్థానిక రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో మద్యం షాపును తనిఖీ చేశారు. రాత్రి వేళల్లో షాపులో మద్యం బాటిళ్ల కప్పులను తొలగించి వాటిలో తాగునీరు కలుపుతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు షాపులోని 1150 మద్యం బాటిళ్లు, 8 బాటిళ్ల విడి కప్పులను స్వాధీనం చేసుకున్నారు. ఆ షాపులో సేల్స్‌మెన్లను అరెస్టు చేశారు. ఈ మద్యం బాటిళ్లను పరీక్ష కోసం విశాఖ పంపించినట్లు సీఐ తెలిపారు.

### జిల్లా రైతుల ఒడిశా యాత్ర



యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

**శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):** నూతన సాంకేతిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కోసం ఆత్మ, శ్రీకాకుళం సౌజన్యంతో జిల్లాలోని రైతులను అంతర్‌రాష్ట్ర విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్తామని జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ శుక్రవారం తెలియజేశారు. ఇందులో భాగంగా ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్, జైపూర్ ప్రాంతాలకు 30 మంది రైతులు వెళ్లి అక్కడ నూతన పద్ధతులతో కూరగాయల సాగు, ఉద్యాన పంటల సాగు, రైతు ఉత్పత్తిదారు సంఘ నిర్వహణ, వాటి కార్యక్రమాల గురించి తెలుసుకుంటారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యవసాయాధికారి జెండా ఊపి లాంఛనంగా యాత్ర ను ప్రారంభించారు. శ్రీకాకుళం ఆత్మ పథక సంచాలకులు డాక్టర్ ఎ.రామచంద్రరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.వెంకటరావు, మండల వ్యవసాయాధికారి రాజేశ్వరరావులు యాత్రకు వెళ్తున్నారు.

# కొనసాగుతున్న సర్గిఫుల్లో ఉత్సవాలు




విద్యార్థులకు వర్క్‌షాపు నిర్వహిస్తున్న దృశ్యం

**పర్లాకిమిడి:** గజపతి జిల్లా రాయఘడ సమితిలో జరుగుతున్న సర్గిపుల్లో ఉత్సవాలు రెండోరోజు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి విక్రం అరుఖ్ ముఖ్య అతిథిగా విచ్చేసి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పర్లాకిమిడి ఎమ్మెల్యే కె.నారాయణరావు, జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఉత్తరాంచల్ ఆర్డీసీ సురేష్ చంద్ర దొళాయి పాల్గొనగా, ముఖ్యవక్తగా మహేంద్రగిరి ఉన్నత మాధ్యమిక విద్యాలయం అధ్యాపకులు ప్రియదర్శి పట్నాయక్ వ్యవహరించారు. ఉదయం భువనేశ్వర్‌కు చెందిన కార్టూనిస్ట్ నందేష్, ఫ్రీలాన్సు కార్టూనిస్టు శివశంకర దాస్ విద్యార్థులకు కార్టూన్లు ఎలా గీయాలి అనే దానిపై వర్క్‌షాపు నిర్వహించారు. సాయంత్రం వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన బాల కళాకారులచే జానపద, లోక నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమాన్ని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ పర్యవేక్షించారు.



అవగాహన కల్పిస్తున్న నందేష్, శివశంకర్ దాస్‌లు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి జగన్నాథ సరక

# సమాజానికి జవాబుదారీగా ఉండాలి

- ఎస్పీ సార్వణ్ వివేక్




క్రైమ్ సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ సార్వణ్ వివేక్

**బరంపురం:** పోలీసు అధికారులు సమాజానికి జవాబుదారీగా ఉండాలని, కేసులను నిజాయితీగా దర్యాప్తు చేసి అపరాధులను కోర్టుకు అప్పగించాలని బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఈ ఏడాది క్రైమ్‌పై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాం, బరంపురం పోలీసు జిల్లాల పరిధిలోని పోలీసుస్టేషన్లలో నేరాల జాబితాలో ఉండి తప్పించుకు తిరుగుతున్న నేరస్తులపై వెంటనే అరెస్టు వారెంట్ జారీ చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో తలదాచుకుంటున్న నేరస్తుల సమాచారం సేకరించి అరెస్టు చేయాలన్నారు. పోలీసుస్టేషన్లలో నమోదవుతున్న కేసులపై పక్కాగా దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో ట్రాఫిక్ అతిక్రమణ జరిమానాలు విధించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి ఎస్‌పీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**జయపురం:** స్థానిక జగన్నాథ స్వామి మందిర ప్రాంగణంలో శుక్రవారం ఉదయం కొరాపుట్ జిల్లా బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో 2024 క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఒడిశా రాష్ట్ర బ్రాహ్మణ సమాజ్ సహాయ కార్యదర్శి బును రథ్, అవిభక్త కొరాపుట్ జిల్లా బ్రాహ్మణ సమాజ్ కో–ఆర్డినేటర్ నరసింగ ప్రధాన్ మిశ్రలు క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సమాజ్ పెద్దలు బిజయ భట్, ముధిరథ్ హోత్త, సన చౌధురి, కిశోర్ పండ, మను రథో, బినోద్ మహాపాత్ర, డొంబురు పండ, జగన్నాథ్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**మల్కన్‌గిరి:** జిల్లాలోని కలిమెల సమితిలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కలిమెల సమితి కేంద్రంలో నివాసముంటున్న అజయ్ కుమార్ మహంతి (43)రోజులాగే శుక్రవారం ఉదయం తన కొడుకును స్కూల్‌లో దించడం కోసం తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఆ సమయంలో కలిమెల సమీపంలోని రైస్ మిల్ వద్ద వెనక నుంచి వచ్చిన పికప్ వ్యాన్ బైక్‌ను ఢీకొనడంతో తండ్రీకొడుకులు పక్కనే ఉన్నటువంటి రాళ్లపై పడిపోయారు. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికులు కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే అజయ్ కుమార్ మరణించినట్లు ధ్రువీకరించారు. కలిమెల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పికప్ వ్యాన్‌ను సీజ్ చేశారు. వ్యాన్ డ్రైవర్ పరారీలో ఉండడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# వినూత్న సాగు.. బతుకు బాగు

- ఆదర్శ వ్యవసాయం చేస్తూ ముందుకు సాగుతున్న కృష్ణప్రసాద్
- ఢిల్లీలో ఉత్తమ రైతు అవార్డు అందుకున్న వైనం
- గత 20 ఏళ్లుగా వినూత్న రీతిలో వ్యవసాయం చేస్తున్న కర్షకుడు



చామంతి తోటలో రైతు

**ఎచ్చెర్ల క్యాంపస్:** ఏడాది పొడవునా ఆదాయం రావాలి.. ఉన్న పొలమంతా సద్వినియోగం కావాలి.. రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి.. సహజ పద్ధతుల్లో పండించాలి.. ఇవే తారక మంత్రాలుగా ఓ రైతు ఇరవై ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారు. యువత కొలువుల కోసం పొలానికి దూరంగా పరిగెడుతుంటే.. డిగ్రీ పట్టా ఉండి కూడా ఆయన మట్టినే నమ్ముకున్నారు. అందుకు తగ్గ ఫలాలు కూడా సాధిస్తున్నారు. కొంగరాం గ్రామానికి చెందిన గోపిన కృష్ణప్రసాద్ వినూత్న రీతిలో సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఏటా ఖరీఫ్‌లో ఆరు ఎకరాల్లో వరి సాగు చేస్తారు. మిగతా 14 ఎకరాల్లో పలు రకాల పంటలు పండిస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ డ్రమ్ సీడ్, సీడ్ డ్రిల్ వంటివి ఉపయోగిస్తున్నారు.

**360 రోజులూ ఆదాయం..**

ఏడాదంతా ఆదాయం పొందేలా పంటలు పండించడం ఈయన ప్రత్యేకత. సూక్ష్మ వ్యవసాయ పద్ధతి అమలు చేస్తూ పాలీ హౌస్‌ల్లో కొన్ని ప్రత్యేక పంటలు సాగుచేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ప్రధానమైన ఘన, ద్రవ జీవామృతాల వినియోగం, పశువుల గత్తం, పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా కషాయాల వినియోగం, రసాయన ఎరువులు పూర్తిగా తగ్గిస్తూ వ్యవసాయ చేస్తున్నారు. పెట్టుబడులు తక్కువ చేసి అధిక రాబడులు పొందుతున్నారు. తుంపర, బిందు సేద్యాల వల్ల కలుపు సైతం పంటల్లో తక్కువగా ఉంటుంది. దీంతో వ్యవసాయ సాగులో కూలీల సంఖ్య తగ్గుతుంది. వ్యవసాయానికి సోలార్ విద్యుత్ వినియోగిస్తున్నారు. ప్రభుత్వ రాయితీలు వచ్చే ప్రతి పథకాన్ని వినియోగించుకుంటున్నారు. ఉచిత విద్యుత్, సూక్ష్మ వ్యవసాయం, సోలార్ విద్యుత్, రాయితీ మీద ఇచ్చే యంత్రాలు వంటివి వినియోగించుకొని ముందుకు సాగుతున్నారు.



మిలీనియం ఫార్మర్స్ మీట్‌లో కృషిజాగరణ్ ఉత్తమ రైతు అవార్డు స్వీకరిస్తున్న కృష్ణప్రసాద్

**రకరకాల పంటలు..**

సీజన్‌కు అనుగుణంగా పంటలు సాగు చేయడం ఆయన అలవాటు చేసుకున్నారు. వరి, స్వీట్ కార్న్, టమోటా, క్యాప్సికం వంటి పంటలతో పాటు పుదీనా, కొత్తిమీర ఇతర ఆకుకూరలు, కూరగాయలు, కర్బూజా, పాలీహౌస్‌లో బంతి, చామంతి వంటి పూలనూ సాగు చేస్తున్నారు. ఆకు కూరలు సైతం పాలీహౌస్‌లో పండిస్తూ మార్కెట్‌లో హోల్‌సేల్ దుకాణాలకు విక్రయిస్తున్నారు. వ్యవసాయం చేస్తూనే రూ.10 లక్షల ఆదాయం సాధిస్తున్నారు.

**పూర్తిస్థాయి అవగాహనతో వ్యవసాయం**

నేను గత 20 ఏళ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నాను. ప్రారంభంలో వరి పంటకు ప్రాధాన్యత ఇచ్చేవాడిని. ప్రస్తుతం వ్యవసాయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ముందుకు సాగుతున్నాను. 360 రోజులు ఆదాయం వచ్చేలా సాగు చేస్తున్నా. కార్తీక మాసంలో పూలు, కూరగాయలకు డిమాండ్ ఉంటుంది. ఈ రకంగా ఆదాయం పొందుతున్నాను. వరి పంట ఆధునాతన సాంకేతిక పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. పాలీహౌస్, గ్రీన్ హౌస్ వంటి వాటిలో పూల తోటలు, ఆకు కూరలు పండిస్తున్నాను. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ మంచి దిగుబడితో పాటు, ఆదాయం సాధిస్తున్నాను. సూక్ష్మ నీటి సేద్యం అమలు చేస్తున్నాను. ఆకుకూరల సాగు వల్ల మంచి ఆదాయం వస్తుంది.

– గోపిన కృష్ణప్రసాద్, రైతు

వాతావరణం, ధరలు, పరిస్థితులు అనుకూలిస్తే ఇంకా మంచి ఆదాయం వస్తుంది. వ్యవసాయంలో ఈయన చేస్తున్న కృషికి కృషి విజ్ఞాన కేంద్ర సిఫార్సుపై న్యూఢిల్లీకి చెందిన భారత వ్యవసాయ మండలి కృషిజాగరణ్ సంస్థ ఉత్తమ రైతుగా ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన మిలీనియం ఫార్మర్స్ మీట్ –2023 అవార్డు అందుకున్నాడు.

# గంజాంలో పాండియన్ పర్యటన నేడు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వివేక్, ఎమ్మెల్యే విక్రమ్ తదితరులు

**బరంపురం:** గంజాం జిల్లాలో 5టీ కార్యదర్శి కార్తికేయ పాండియన్ శనివారం నుంచి రెండు రోజులు పర్యటించనున్నారు. ఈ మేరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ తెలియజేశారు.

బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ పండాతో పాటు జిల్లా బీజేడీ నాయకులు ఏర్పాట్లను పరిశీలించారు. పర్యటనలో భాగంగా ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

# భయపెడుతున్న ఎలుగుబంట్లు

**మల్కన్‌గిరి:** జిల్లాలోని మల్కన్‌గిరి సమితి ఎంవీ 7 గ్రామంలో ఎలుగుబంట్లు కలకలం సృష్టిస్తున్నాయి. ఆహారం కోసం ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. గ్రామంలోని అరుణ్ దేవాన్ అనే వ్యక్తి ఇంటి గోడ దూకి 3 ఎలుగుబంట్లు ఇంటి బయట ఉన్నటువంటి కోళ్లను తినడం గురువారం రాత్రి సీసీ కెమెరాలో నమోదయ్యింది. దీంతో ఫుటేజీ చూసి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు షాక్ అయ్యారు. గత కొన్ని రోజులుగా ఇలాగే జరుగుతోంది. ఈ విషయంపై మల్కన్‌గిరి అటవీ శాఖ రేంజర్ జగన్నాథ్ ప్రసాద్ బిసాయి మాట్లాడుతూ.. రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించి, ఎలుగులను పట్టుకుంటామని తెలియజేశారు.



సీసీ కెమెరాకు చిక్కిన ఎలుగుబంట్లు

# ‘రబీలో సాగునీరు విడిచిపెట్టాలి’



చీఫ్ ఇంజినీర్‌తో మాట్లాడుతున్న రబినందో తదితరులు

**జయపురం:** రబీ సీజన్‌లో తమ పంట భూములకు సాగునీరు విడిచిపెట్టాలని బొరిగుమ్మ సమితి రణసపూర్, గుజినిగుడ, బెణాగాం గ్రామ పంచాయతీల రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు బరిణిపుట్‌లోని అప్పర్ కొలాబ్ ప్రాజెక్టు, తెలింగిరి సాగునీటి ప్రాజెక్టు డివిజన్ల చీఫ్ ఇంజినీర్‌ను బుధవారం కలిసి విన్నవించారు. వెంటనే తమ పొలాలకు తెలింగిరి ప్రాజెక్టు నుంచి నీరు విడిచిపెట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఇంజినీర్, రైతులకు మధ్య వాగ్వాదం జరిగింది. అయితే రైతులతో పాటు వచ్చిన మాజీ మంత్రి రబినారాయణ నందో కలుగజేసుకొని వారిని శాంతింపజేశారు. చీఫ్ ఇంజినీర్‌తో చర్చించి సమస్యను పరిష్కరించారు. దీంతో త్వరలోనే సాగునీరు విడిచిపెడతామని ఇంజినీర్ హామీ ఇచ్చారు.

# ఆదర్శనీయుడు వల్లబాయ్ పటేల్



వల్లబాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**బరంపురం:** భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయ్ పటేల్ నేటి యువతకు ఆదర్శనీయుడని గంజాం జిల్లా బీజేపీ అధ్యక్షుడు డా.సుభాష్ సాహు అన్నారు. స్థానిక కోర్టుపేట జంక్షన్‌లో ఉన్నటువంటి సీనియర్ సిటిజన్ పార్క్‌లో సర్దార్ వల్లబాయ్ పటేల్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆయన వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ సాహు మాట్లాడుతూ వల్లబాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రామ్‌పాత్రో ప్రహ్లాద్ పాణిగ్రహి, అశోక్ నిమాయ్, రజనీకాంత్ మండలి, భగవాన్ భూయ్యా, రాజేష్ మఝి తదితరులు పాల్గొన్నారు.

# రెండు ఆలయాల్లో చోరీ

**ఆమదాలవలస:** ఆమదాలవలస పట్టణంలో గురువారం అర్ధరాత్రి రెండు ఆలయాల్లో చోరీ జరిగింది. ఆమదాలవలస ఎస్ఐ వై.కృష్ణ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని లక్ష్మీ నగర్ వీధిలో గల కన్యకా పరమేశ్వరి ఆలయం, పట్టణ శివారులోని కృష్ణాపురం గ్రామం సమీపంలో చెవిటమ్మ తల్లి ఆలయంలో చోరీ జరిగింది. కన్యకా పరమేశ్వరి ఆలయంలో గల సుమారు 5కిలోల వెండి వస్తువులు, ఒక తులమున్నర బంగారు నగలు, హుండీలోగల సుమారు రూ. 30వేలు నగదు దొంగిలించారు. అలాగే చెవిటమ్మతల్లి ఆలయంలో కొంత నగదు మాత్రమే చోరీకి గురైంది. కన్యకాపరమేశ్వరి ఆలయం వెనక వైపు ఉన్న గోడ పైనుంచి దూకి తాళాలను గ్యాస్ కట్టర్లతో కోసి చోరీకి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాలు కట్ చేసి దానికి సంబంధించిన బాక్స్‌ను దుండగులు తీసుకొని వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం అర్చకుడు బలివాడ మృత్యుంజయ శాస్త్రి ఆలయానికి వెళ్లగా లోపల తలుపులు తెరిచి ఉండడంతో ఆలయ ధర్మకర్తకు సమాచారం అందించారు.



శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో చోరీ జరిగిన ప్రాంతంలో పరిశీలిస్తున్న క్లూస్ టీం

ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు సిబ్బంది క్లూస్‌టీమ్‌తో వచ్చి పరిశీలించారు. గుడిలో రాత్రి కాపలాదారుగా పనిచేస్తున్న బొబ్బిలి రామారావు అనారోగ్యం కారణంగా గురువారం విధులకు హాజరు కాలేదు. దీంతో సులువుగా దొంగతనం జరిగిందని చెబుతున్నారు.

# కొత్తకోటలో రెండు మోటార్లు చోరీ



మోటార్లు దొంగిలించడంతో ఖాళీగా ఉన్న బోరు

**లావేరు:** మండలంలోని కొత్తకోట గ్రామంలో గల వ్యవసాయ పొలాల్లో రెండు వ్యవసాయ మోటార్లు చోరీకి గురయ్యాయని రైతులు శుక్రవారం తెలిపారు. జాగు అమ్మాజీ, పులపా మల్లేశ్వరరావు అనే రైతులు బోర్లు వేసి మోటార్లు బిగించి వ్యవసాయం చేస్తున్నారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి బోర్లకు బిగించిన ఉన్న మోటార్లను తీసుకెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం రైతులు పొలానికి వెళ్లి చూడగా మోటార్లు కనిపించకపోవడంతో లావేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## క్లుప్తంగా

### ఘోషాఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

● మహిళ కడుపులో 3 కిలోల కణితి తొలగింపు



బంగారమ్మకు ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ అరుణ శుభశ్రీ,, సిబ్బంది (ఇన్‌సెట్లో) కణితి

**విజయనగరం ఫోర్ట్:** నాలుగేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్న మహిళకు ఘోషాఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి విముక్తి కల్పించారు. గంట్యాడ మండలం దిగువ కొండపర్తి గ్రామానికి చెందిన పాగి బంగారమ్మ (47) నాలుగు సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతోంది. గత నెల 27వతేదీన ఆమె ఘోషాఆస్పత్రిలో చేరగా సిటిస్కాన్ చేసి కడుపులో కణితి ఉన్నట్లు గుర్తించారు. ఈనెల 8వతేదీన బంగారమ్మకు గైనికాలజీ విభాగం హెడ్ డాక్టర్ అరుణ శుభశ్రీ ఆపరేషన్ చేసి కడుపులో ఉన్న 3 కిలోల కణితిని తొలగించారు. ఆస్పత్రిలో మేజర్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినందుకు డాక్టర్ అరుణ శుభశ్రీతో పాటు ఇతర వైద్యులు, సిబ్బందిని ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిలా సునందని అభినందించారు.

### తారు లారీ, కంటైనర్ ఢీ

● త్రుటిలో తప్పిన పెనుప్రమాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీల ముందు భాగాలు

**బొండపల్లి:** మండల కేంద్రానికి సమీపంలో జాతీయ రహదారి 26పై శుక్రవారం వేకువ జామున ఎదురెదురుగా ఓ లారీ, కంటైనర్ ఢీకొని నుజ్జునుజ్జయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి వస్తున్న తారు లారీతో పాటు గజపతినగరం నుంచి విజయనగరం వెళ్తున్న కంటైనర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వాహనాల ముందు భాగాలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. అలాగే వాహనాల్లో ప్రయాణిస్తున్న డ్రైవర్లతో పాటు, క్లీనర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. త్రుటిలో పెనుప్రమాదం తప్పడంతో వాహనదారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

### గిరిజన విద్యార్థిని మృతి పట్ల ఎస్టీ కమిషన్ చైర్మన్ దిగ్భ్రాంతి



ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

**గుమ్మలక్ష్మీపురం:** మండలంలోని కె.డి కాలనీ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు)కు చెందిన విద్యార్థిని బిడ్డిక సీత అనారోగ్యంతో మృతిచెందడం పట్ల ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీత మృతిచెందడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటన గురించి తెలియగానే అధికారులను ఆరా తీసినట్లు చెప్పారు. పాఠశాలకు దగ్గరగా మెరుగైన వైద్య సేవలు ఉండి కూడా ఇలాంటి సంఘటనలు జరగడం విచారకరమని ఆవేదన వెలిబుచ్చారు. ఈ సంఘటనపై వెంటనే విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించామని స్పష్టం చేశారు.

### జాతీయ క్రికెట్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి



జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన చరణ్‌తేజ

**దత్తిరాజేరు:** మండలంలోని షికా రుగంజి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి అండర్14 వి భాగంలో జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు అర్హత సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. స్కూల్‌లో 8 వ తరగతి చదువుతున్న చెల్లూరు గ్రామానికి చెందిన బి.చరణ్ తేజ ఇటీవల నంద్యాల జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటిలకు అర్హత సాధించినట్లు చెప్పారు. విద్యార్థి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.

# జాబ్ గ్యారంటీ..!

● స్కిల్ కళాశాలలో ఉచితంగా ఉపాధి శిక్షణ
● సద్వినియోగం చేసుకుంటున్న యువత
● మూడు నెలల ట్రైనింగ్
● ఉచితంగా భోజన, వసతి సౌకర్యాల కల్పన



ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ శిక్షణ పొందుతున్న అభ్యర్థులు





సీతంపేటలోని స్కిల్ కళాశాల

**సీతంపేట:** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. దీనిలో భాగంగా ఉచితంగా ఉపాధి శిక్షణ అందజేసి వివిధ కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్ కల్పించేందుకు ఉపక్రమించింది. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూత్ ట్రైనింగ్ సెంటర్‌ను స్కిల్ కళాశాలగా మార్పు చేశారు. ఇక్కడ అవసరమైన రకరకాల శిక్షణలు ఇవ్వదలిచారు. దీనదయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన, నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా మొదటి విడతలో ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ (ఎఫ్‌వోఈ), ఫుడ్ అవుట్‌లెట్ మేనేజర్ (ఎఫ్‌వోఎం) కోర్సులో 30 మంది చొప్పున మొత్తం 60 మంది పురుష, మహిళా అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణకు ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. వారికి ప్రత్యేక ట్రైనర్ల ద్వారా బోధిస్తున్నారు.ఇదే శిక్షణ ప్రైవేట్ కంపెనీలు ఇస్తే ఒక్కో అభ్యర్థికి మూడు నెలల పాటు లక్షల్లో ఖర్చవుతుంది. పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే అన్ని ఖర్చులు భరించి నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తోంది. అనంతరం శిక్షణ సర్టిఫికట్లు కూడా మంజూరు చేయనుంది.

**ఒక్కో అభ్యర్థికి రూ.లక్షా 50 వేల వరకు ఖర్చు**

మూడు నెలల పాటు ఇచ్చే ఈ శిక్షణకు దాదాపు రూ.లక్షా 50 వేల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, కోర్సులకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. రెండు జతల యూనిఫారాలు, మూడు పూటల భోజన, వసతి సౌకర్యాలు కల్పించారు. వీరికి ప్రత్యేక మెనూ రూపొందించారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించిన మెటీరియల్ సరఫరా చేశారు. విశాఖపట్నంతో పాటు ఇతర పట్టణాల్లో ఉన్న ప్రముఖ కంపెనీలకు తీసుకు వెళ్లి పది నుంచి 15 రోజుల పాటు ఆన్‌జాబ్ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. అటు తర్వాత ప్రత్యేక ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు సంబంధిత అధికారులు తెలియజేస్తున్నారు.శిక్షణ పొందిన ప్రతి అభ్యర్థికి మూడు నెలలకు రూ.5 వేల స్టైపెండ్ డైరెక్టుగా బ్యాంకు ఖాతాలో జమఅవుతుంది. ఉన్నతి పథకంలో ఇదివరకే రిజిస్టర్ అయిన దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అభ్యర్థులకు రోజుకు రూ.300లు చొప్పున శిక్షణ పూర్తయిన తర్వాత బ్యాంకు ఖాతాలో రూ.27 వేలు జమ చేయనున్నారు.



ఎఫ్ఓఎం శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

**ఉపాధి లభిస్తుందని ఆశ**



మాది కొమరాడ మండలం తాడంగి వలస. నాన్న లేరు. అమ్మ కష్టంతో డిగ్రీ వరకు చదివాను. నా కాళ్లపై నేను నిలబడాలనే ఉద్దేశంతో ఈ ట్రైనింగ్‌లో చేరాను. ఇక్కడ అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు. కష్టపడి అన్ని అంశాలను నేర్చుకుని ఉద్యోగంలో చేరతానని నమ్ముతున్నాను.

కె.స్వర్ణ, ఎఫ్‌వోఈ శిక్షణ అభ్యర్థి

**స్వయం ఉపాధికి బాటలు వేసుకుంటా**



స్వయం ఉపాధికి బాటలు వేసుకోవడానికి ఈ తరహా శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయి. నేను సొంతంగా మంచి హోటల్ పెట్టుకుని నడిపించి ఉన్నతస్థాయికి ఎదుగుదామని ఈ శిక్షణలో చేరాను. మంచి స్థాయికి చేరుకుంటానని ఆశిస్తున్నాను.

జన్ని రాజేష్, ఎఫ్ఓఎం, శిక్షణ అభ్యర్థి

**నిరుద్యోగులకు వరం**



ప్రభుత్వం నిరుద్యోగులకు ఇస్తున్న ఈ తరహా శిక్షణలు వరం వంటివి. ఈ శిక్షణ ప్రారంభించి రెండు నెలలవుతోంది. మరో నెలపాటు శిక్షణ పూర్తయితే కొత్త బ్యాచ్ మళ్లీ ప్రారంభిస్తాం. నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామాల్లో కూడా విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం.

బి.వెంకటరమణ, సమన్వయకర్త, జిల్లా స్కిల్ కళాశాల, సీతంపేట

**క్రమశిక్షణతో కూడిన ట్రైనింగ్**



క్రమశిక్షణతో కూడిన శిక్షణను అభ్యర్థులకు అందిస్తున్నాం. కంప్యూటర్ పరిజ్ఞానంపై తెలియజేస్తున్నాం. ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా శిక్షణ ఇస్తున్నాం. అవకాశాలను అందిపుచ్చుకుంటే మంచి భవిష్యత్ ఉంటుంది.

రవి, ట్రైనింగ్ పార్టనర్, స్కిల్ కళాశాల, సీతంపేట

## కొత్త సాఫ్ట్‌వేర్‌లో ధాన్యం కొనుగోలు

● డీఎస్ఓ మధుసూదన రావు



దరఖాస్తులు పరిశీలిస్తున్న డీఎస్ఓ మధుసూదన రావు

**బొబ్బిలి:** ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేసేందుకు కొత్త సాఫ్ట్ వేర్‌ను వినియోగిస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి కె.మధుసూదన రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓటరు జాబితా సవరణ ప్రత్యేకాధికారిగా బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి సవరణ దరఖాస్తులను పరిశీలించారు. నియోజకవర్గంలోని బీఎల్ఓల వద్ద గల దరఖాస్తులు పరిమిత శాతం మించి ఉన్నాయా? లేదా అని వాస్తవాలను గుర్తించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలోని ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారని చెప్పారు. అన్ని మిల్లుల్లో కస్టోడియన్లను నియమించినట్లు తెలిపారు. అలాగే రైతు భరోసా కేంద్రాల నుంచి సేకరించిన ధాన్యాన్ని మండల పరిధిలోని మిల్లులకు మాత్రమే తరలించేలా కొత్త సాఫ్ట్‌వేర్ రూపొందించారన్నారు. మండల పరిధిలోని మిల్లులకు ఎవరి ప్రమేయం లేకుండా రైతులు తరలించేలా ఆటో ట్యాగింగ్ జరుగుతుందని, ధాన్యం తీసుకువచ్చేందుకు అవసరమైన గోనెలను రైతులు, మిల్లర్లు, ప్రభుత్వం ఎవరి నుంచి వినియోగించినా తగిన ధర వారికే చెల్లించేలా ఈ సారి సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 14వేల టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయిందన్నారు. ఇటీవలే మిచాంగ్ తుఫాన్ నుంచి తేరుకుని ధాన్యం విక్రయాలు ప్రారంభించిన నేపథ్యంలో 3.20లక్షల గోనె సంచులు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది కొత్తగా 9 మిల్లులు టాగ్ అయినందున కొనుగోలుకు ఎటువంటి ఇబ్బందులూ లేవని, 1/1 నిష్పత్తిలోనే మిల్లర్ల బ్యాంకు గ్యారెంటీలకు తగినట్లుగా ధాన్యం అప్పగిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఉప తహసీల్దార్ బలివాడ గౌరీశంకర్ తదితరులు ఉన్నారు.

## నిరుద్యోగులకు అండగా ప్రభుత్వం

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

**పార్వతీపురంటౌన్:** నిరుద్యోగులకు అండగా ప్రభుత్వం నిలుస్తుందని, ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గాయత్రి డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ జాబ్‌మేళా ద్వారా నియామకాలు చేపట్టడానికి 16 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారన్నారు. 521 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా అందులో 136మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగులుగా ఎంపికయ్యారని తెలిపారు. ఉద్యోగావకాశాలు పొందడానికి సంబంధిత అంశాల్లో నైపుణ్యాలు అవసరమని, నైపుణ్యం గల యువతకు అనేక అవకాశాలు, డిమాండ్ ఉందని, ప్రపంచంలోనే యువత అత్యధికంగా ఉన్న దేశం మనదన్నారు. రాష్ట నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా అందిస్తున్న నైపుణ్య శిక్షణను తీసుకుని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. నిరుద్యోగ యువత ఇలాంటి జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్, రీజనల్ నైపుణ్యాభివృద్ధి అధికారిణి రోహిణి, జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి వహిదా, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, గాయత్రి కళాశాల చైర్మన్ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు బైక్‌లు ఢీ కొని కానిస్టేబుల్ మృతి



ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ సత్యనారాయణ

**గుమ్మలక్ష్మీపురం/కురుపాం:** కురుపాం మండలం కొండలేవిడి వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో పాలకొండలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కిల్లక సత్యనారాయణ మృతిచెందారు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. విధి నిర్వహణకు కానిస్టేబుల్ సత్యనారాయణ గుమ్మలక్ష్మీపురం నుంచి పాలకొండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్తుండగా కొండబారిడి నుంచి ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో ఆయన ఛాతీకి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాన్ని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతిచెందిన కానిస్టేబుల్ స్వగ్రామం గుమ్మలక్ష్మీపురం మండలంలోని కళిగొట్టు గ్రామం. మరో బైక్‌పై ఉన్న కారిమానుగూడ గ్రామానికి చెందిన నిమ్మక సంతోష్ తల, కాలికి తీవ్ర గాయాలై పరిస్థితి విషమించడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న నీలకంఠాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కానిస్టేబుల్ మృతి వార్తతో గ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి.

### ఆడలి వ్యూ పాయింట్ పనులు పూర్తి చేయాలి



పర్యాటక పనులను పరిశీలిస్తున్న పీవో కల్పనాకుమారి

**సీతంపేట:** ఆడలి వ్యూ పాయింట్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి కోరిరు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఆడలి పర్యాటక పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ నాగభూషణరావుకు పలు సూచనలు చేశారు. పనులు నాణ్యతగా ఉండాలని, ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

### ఉత్సాహంగా సైనిక్ స్కూల్ క్రీడా పోటీలు



షాట్‌పుట్ విసురుతున్న విద్యార్థిని

**విజయనగరం రూరల్:** కోరుకొండ సైనిక్ పాఠశాలలో మూడు రోజులుగా 61 వ వార్షికోత్సవ అథ్లెటిక్స్ మీట్ పోటీలు ఉత్సాహభరితంగా జరుగుతున్నాయి. శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన జావెలిన్ త్రో, షాట్‌పుట్, పరుగు పందెంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలను పాఠశాల ప్రిన్సిపాల్ గ్రూప్‌కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి, ప్రధానోపాధ్యాయుడు కేశవన్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ ఖోఖో పోటీలకు షబ్బీర్ ఎంపిక



జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన షబ్బీర్‌తో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు

**విజయనగరం:** జాతీయస్థాయిలో జరగనున్న ఖోఖో పోటీలకు విజయనగరం పట్టణానికి చెందిన షబ్బీర్ ఎంపికయ్యాడు. ఇటీవల రాష్ట్రస్థాయిలో చిత్తూరు జిల్లాలో జరిగిన అంతర్ జిల్లా జూనియర్స్ ఖోఖో పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన షబ్బీర్ అద్భుత ఆటతీరు కనబరచడంతో ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు రాయిపూర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనబోయే ఆంధ్రప్రదేశ్ జట్టుకు అర్హత సాధించాడు. జాతీయ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారుడిని ఫూల్‌బాగ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్ సత్యప్రసాద్ అభినందించారు.

## 17న పెన్షనర్లకు సత్కారం

● రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా కమిటీ



ఆహ్వాన పత్రాన్ని విడుదల చేస్తున్న సంఘం సభ్యులు

**విజయనగరం అర్బన్:** అఖిల భారత పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17న 75 ఏళ్ల వయసు నిండిన పెన్షనర్లను ఘనంగా సత్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా కమిటీ పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం స్థానిక సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో పేర్కొన్నారు. పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా సంఘం సీనియర్ సభ్యులను సత్కరించడం ఆనవాయితీ అని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 75 ఏళ్ల వయసు నిండిన పెన్షనర్లు సుమారు 100 మంది ఉంటారని వారంతా హాజరుకావాలని కోరారు. సభ్యులు ప్రతి ఒక్కరూ తమ పెన్షన్ గుర్తింపు కార్డుల (పుస్తకాలు)తో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విశిష్ట అతిథిగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నగరపాలక సంస్థ వైస్‌చైర్మన్ కోలగట్ల శ్రావణి, జిల్లా ఖజానా, అకౌంట్స్ ఆఫీసర్ ఆర్ఎస్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఆహ్వాన పత్రాన్ని పోస్టును విడుదల చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీఆర్‌రాఘవరాజు, జిల్లా అధ్యక్షుడు పెద్దింటి అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నారాయణ, జిల్లా కోశాధికారి ఎం.సూర్యనారాయణ, పట్టణ శాఖ అధ్యక్షుడు వి.సూర్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి సీహెచ్.త్రినాథ్ ప్రసాద్, పట్టణ కోశాధికారి రామానుజరావు, వీఎస్ఆర్‌నాయుడు, ఎస్.లక్ష్మణరావు, ఎస్.సత్యంనాయుడు, కె.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## జీఎంఆర్ ఐటీలో బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక



అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ స్త్రీ, పురుషుల జట్ల సభ్యులతో నిర్వాహకులు

**రాజాం సిటీ:** అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ పోటీలకు సంబంధించి జేఎన్‌టీయూ జీవీ తరపున స్త్రీ, పురుషుల బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక జీఎంఆర్ ఐటీలో శుక్రవారం నిర్వహించామని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 19 నుంచి 24 వరకు తమిళనాడులోని వెల్లూరు విట్‌లో జరగనున్న పోటీల్లో పురుషుల జట్టు పాల్గొంటుందని అన్నారు. అలాగే జనవరి 2 నుంచి 5 వరకు కర్నాటకలోని విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీలో జరగనున్న పోటీల్లో మహిళలు పాల్గొంటారని పేర్కొన్నారు. ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ ఎస్‌వీ ప్రసాద్, అకడమిక్ డీన్ డాక్టర్ ఎంవీ నాగేశ్వరరావు, జేఎన్‌టీయూ జీవీ అబ్జర్వర్ కె.ప్రసాద్, ఎక్స్‌టర్నల్ కమిటీ మెంబర్ సీహెచ్ సునీల్‌లు జట్లు ఎంపిక చేశారన్నారు. పురుషుల జట్టు తరపున వి.అభిషేక్, కె.హరిన్‌కోవింద్ (రఘు ఇంజినీరింగ్ కళాశాల), కె.అఖిల్ (విజ్ఞాన్ కళాశాల), వి.ప్రవీణ్‌కుమార్ (ఎంవీజీఆర్ కళాశాల), డీబీవీ వివేక్ (జేఎన్‌టీయూ జీవీ), ఎస్.అశ్వంత్ (చైతన్య కళాశాల), డి.వీరవర్ధన్ (లెండి కళాశాల) ఎంపికయ్యారని, అలాగే మహిళల జట్టు తరపున పి.పూజిత, కె.శ్రీవైష్ణవి (రఘు ఇంజినీరింగ్ కళాశాల), ఆర్.సాయిలక్ష్మి, పి.లోహిత, జి.అమృతవర్షిణి, ఎం.ధరణి, బి.తేజశ్రీ (జీఎంఆర్ ఐటీ)లు ఎంపికైన వారిలో ఉన్నారని వివరించారు. వారి ఎంపికపట్ల విద్యార్థులు, కళాశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## దోనుబాయి ఆశ్రమపాఠశాల సందర్శన



కంప్యూటర్‌లో మెనూ వివరాలు పరిశీలిస్తున్న డీడీ మంగవేణి

**సీతంపేట:** మండలంలోని దోనుబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను గిరిజన సంక్షేమ శాఖ డీడీ మంగవేణి శుక్రవారం సందర్శించారు. హాజరు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. పదో తరగతి విద్యార్థులు బాగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మెనూ అమలు తీరును పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కొండగొర్రె సుబ్బారావు పాల్గొన్నారు.

## ప్రారంభమైన విద్యుత్ పొదుపు వారోత్సవాలు

● 20 వరకు జిల్లాలో నిర్వహణ



ఎస్ఈ లక్ష్మణరావు

**విజయనగరం ఫోర్ట్:** విద్యుత్ వినియోగం జిల్లాలో ఊహించని విధంగా పెరుగుతోంది. నీరు, గాలి మాదిరి విద్యుత్ కూడా అత్యవసర వినియోగంగా మారింది. గతంలో టీవీలు, ఏసీలు, కూలర్లు, వాషింగ్ మిషన్లు కొద్దిమంది ఇళ్లలోనే ఉండేవి. కానీ ఇప్పుడు వాటి వినియోగం బాగా పెరిగిపోయింది. దీంతో విద్యుత్ వినియోగం కూడా భారీగా పెరుగుతోంది. ఒక్క క్షణం విద్యుత్ లేకపోతే చాలు ఏదో కోల్పోయిన మాదిరి జనం విలవిల్లాడిపోతున్నారు. కొంత మంది విద్యుత్‌ను ఇష్టానుసారంగా వినియోగిస్తున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు లైట్లు, ఫ్యాన్లు ఆపకుండా వెళ్తున్నారు. ఈ విధంగా విద్యుత్‌ను దుబారా చేస్తే భావితరాలకు విద్యుత్ కొరవడే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యుత్‌శాఖ విద్యుత్ పొదుపు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను, విద్యుత్ అధికంగా వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేసేందుకు ఈనెల 14వతేదీ నుంచి 20 వతేదీ వరకు వివిధ రుపాల్లో విద్యుత్ పొదుపు వారోత్సవాలను నిర్వహించనుంది. ఈ మేరకు గురువారం జిల్లాలో విద్యుత్ పొదుపు వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎస్ఈ లక్ష్మణరావు తెలియజేసిన విద్యుత్ పొదుపు సూత్రాలిలా ఉన్నాయి.

**వేడి పదార్థాలు ఫ్రిజ్‌లో పెట్టకూడదు.**

- ఎక్కువ రోజులు ఊర్లకు వెళ్లినప్పుడు ఫ్రిజ్ ఆఫ్ చేయాలి
- హోటల్స్, వాణిజ్య సముదాయాలు అపార్ట్‌మెంట్లలో సోలార్ హీటర్లు వాటాలి.
- వీలైనంత వరకు బట్టలను ఆరుబయట ఆరబెట్టాలి.
- ఏసీలను సామాన్యమైన చల్లదనం కోసం 26 డిగీల సెంటీగ్రేడ్ సెట్టింగ్ చేయాలి
- ఎల్ఈడీ బల్బులను వాడాలి
- పరిశ్రమల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు అన్ని విద్యుత్ ఉపకరణాల స్విచ్‌లు ఆపివేయాలి
- విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరిగిన తర్వాత ఒకటి తర్వాత ఒక ఆన్ చేయాలి. పారిశ్రామిక మోటార్లు తరచూ మార్చకూడదు.
- వైండింగ్ తరచూ మార్చితే సామర్థ్యం తగ్గి విద్యుత్ వృథా అవుతుంది.
- మోటార్లకు రేటెడ్ కెపాసిటర్లను బిగించాలి.

**విద్యుత్ పొదుపు చర్యలు**

సాధారణ బల్బు, జీరో వోల్ట్ బల్బు, ట్యూబ్, ఫ్యాన్, టీవీని వినియోగించినట్లయితే 52 యూనిట్ల విద్యుత్ నెలకు ఖర్చవుతుంది. విద్యుత్ పరికరాల వినియోగం, ఎల్ఈడీ బల్బుల వాడడం, పొదుపు సూత్రాలను పాటించడం ద్వారా నెలకు 38 యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుంది. ప్రస్తుత టారిఫ్ ప్రకారం సంవత్సరానికి 205 రుపాయలు ఆదా చేసుకోవచ్చు.

- 3 లేదా అంతకంటే ఎక్కువ స్టార్లు ఉన్న గృహోపకరణాలు వాడాలి.
- ఎలక్ట్రానిక్ వస్తువులను రిమోట్‌తో ఆపి స్విచ్ ఆఫ్ చేయాలి.

## 'వైష్ణవ క్షేత్ర దర్శని'కి ప్రత్యేక బస్సులు

**పార్వతీపురం టౌన్:** ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పార్వతీపురం డిపో నుంచి వైష్ణవ క్షేత్రదర్శిని పేరుతో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ కనకదుర్గ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని పురాతన మహిమాన్విత వైష్ణవ క్షేత్రాలను పవిత్ర ధనుర్మాసంలో దర్శించుకునేందుకు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. డిసెంబర్ 17, 24, 31, జనవరి 7వ తేదీన పార్వతీపురం డిపో నుంచి ఉదయం 6 గంటలకు బస్సులు బయలు దేరి మూడు ఆలయాలు దర్శించుకొని తిరిగి సాయంత్రం ఆరు గంటలకు పార్వతీపురం చేరుతాయని ఆమె తెలిపారు. ఆసక్తి గల భక్తులు టికెట్లను ఏపీఎస్ ఆర్టీసీ ఆన్‌లైన్‌లో, గుర్తింపు పొందిన ఏజెంట్ల వద్ద, సెల్ నంబర్: 73828 34909కు ఫోన్ చేసి టికెట్లు బుక్‌చేసుకోవచ్చన్నారు.

### రైతులకు అండగా ఉండాలి

**పాలకొండ రూరల్:** ప్రస్తుత సీజన్‌లో ధాన్యం అమ్మకాలు నేపథ్యంలో వ్యవసాయాధికారులు, ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అండగా నిలవాలని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సూచించారు. లుంబూరు ఆర్‌బీకేను ఆమె శుక్రవారం సందర్శించారు. పంటల దిగుబడిపై ఆరాతీశారు. ధాన్యం అమ్మకాలకు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ఆర్‌బీకే సేవలపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో ఏఓ వాహిణి పాల్గొన్నారు.